సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు సిరిపురపు కండాల రూపశ్రీ (ఖైలవరం) సోమవారం రూ.51,116 విరాళం సమర్పించారు.




పాఠశాలే ప్రయోగశాల

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా కృషి చేస్తున్నాయి. నేడు జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

8లో

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 7,555 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,130, మధ్య డెల్టాకు 1,425, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

ప్రతినెలా 27న నిధి ఆప్‌కే నికాత్

- ఖాతాదారుల ముంగిటే పరిష్కార వేదిక
- కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మాధవీలత

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఆధ్వర్యంలో 'నిధి ఆప్‌కే నికాత్ 2.0' నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ప్రతినెలా 27వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతుందని, ఒకవేళ ఆరోజు ప్రభుత్వ సెలవు అయితే తరువాత కార్యాలయం పనిచేసే రోజున నిర్వహిస్తారన్నారు. స్థానిక మోరంపూడి ఈపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో నిధి ఆప్‌కే నికాత్ 2.0 డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌ను సోమవారం ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) పునరుద్ధరించిన నిధి ఆప్‌కే నికాత్ ప్రోగ్రామ్ ద్వారా దేశంలోని అన్ని జిల్లాల్లో పెద్దఎత్తున జిల్లాస్థాయిలో ఔత్సాహిక ప్రోగ్రామ్‌ను ప్రారంభించామన్నారు. ఈపీఎఫ్ ఖాతాదారుల ఇంటి ముంగిటే సేవలు అందించడం ఇందులోని ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ క్లెయిమ్ ఫైల్ చేయడం తదితర సేవలను సభ్యులు పొందేలా హెల్ప్‌డెస్క్ ఉంటుందన్నారు. భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్తి అహూజా సోమవారం దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని న్యూఢిల్లీలో ఈ–లాంచ్ చేశారన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: నెల్లూరు జిల్లాలోని శ్రీసిటీలో ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ మల్టీనేషనల్ కంపెనీలో ట్రైనీ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్, బీఎస్సీ 2018–22 మధ్య పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గలవారు బొమ్మూరు యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ) ఆవరణలోని జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అభ్యర్థులకు రూ.15,800 జీతంతో పాటు మొదటి మూడు నెలలు ఉచిత వసతి కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ రాజ్‌కుమార్(9581810049)ను సంప్రదించాలన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): తూర్పు గోదావరి జిల్లా పరిధిలో పేద పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు కేటాయించినట్టు డీఈఓ ఎస్.అబ్రహం సోమవారం తెలిపారు. వెనుకబడిన వర్గాలకు 5 శాతం, అనాథ, హెచ్ఐవీ, వికలాంగులకు 10 శాతం, షెడ్యూలు తెగలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఓసీ (పల్లె ప్రాంతంలో వార్షిక ఆదాయం ఏడాదికి రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.1.44 లక్షలు మించిన వారు అర్హులు) లకు ఆరుశాతం కేటాయించారన్నారు. వచ్చేనెల 18 నుంచి ఏప్రిల్ 7 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. మొదటి లాటరీ ఏపిల్ 13న తీస్తారని, ఫలితాలు, విద్యార్థి ఎంపిక 15 నుంచి 21 వరకు ఉంటుందన్నారు. రెండో లాటరీ 25వ తేదీ జరుగుతుందని, ఫలితాలు, విద్యార్థి ఎంపిక 26 నుంచి 30 వరకూ ఉంటుందన్నారు. దరఖాస్తులను సీఎస్‌ఈ.ఏపీ.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని గడువులోగా వాటిని తిరిగి సమర్పించాలన్నారు.

రూ.25 లక్షలు దుర్వినియోగంపై ఫిర్యాదు

మామిడికుదురు: కరవాక – ఓడలరేవు జాయింట్ రేవు ద్వారా 2019–23 మధ్య వచ్చిన రూ.25 లక్షల ఆదాయాన్ని పంచాయతీ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు దుర్వినియోగం చేశారని కరవాకకు చెందిన చింతా రమేష్ ఆరోపించారు. ఈ మేరకు అమలాపురంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కరవాక – ఓడలరేవులో ప్రయాణాలను 2019 నుంచి 2023 జనవరి వరకూ పంచాయతీరాజ్ అధికారులు నిలుపు చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే పంచాయతీ కార్యదర్శి రోజుకు రూ.1,600 చెల్లించే విధంగా రేవు దాటింపునకు సొంతంగా అనుమతి ఇచ్చారన్నారు. ఈవిధంగా సుమారు రూ.25 లక్షల ఆదాయం వచ్చిందని, దీనిని ఎక్కడా పంచాయతీకి జమ చేయలేదని ఆరోపించారు. ఈ మొత్తాన్ని రికవరీ చేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని, నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని రమేష్ డిమాండ్ చేశారు. కాగా రెండు గ్రామాలకు చెందిన పెద్దలు ప్రైవేటు పడవ ఏర్పాటు చేసుకున్నారని, ఇందులో తన ప్రమేయమేమీ లేదని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు చెప్పారు.

ఆది నుంచే అగ్రాసనమే..

- ఉన్నత పదవుల్లో బీసీలకు సముచిత స్థానం
- తండ్రి వైఎస్ బాటలోనే తనయుడు జగన్
- తాజాగా ఎమ్మెల్సీ సీటులోనూ బీసీలకే పట్టం
- సీఎం నిర్ణయంతో పెద్దల సభకు కుడుపూడి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: మాట నిలబెట్టుకోవడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి తన మార్కును చాటుకున్నారు. బలహీన వర్గాలకు అన్నింటా పెద్ద పీట వేస్తానని వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచీ చెబుతూ వస్తున్నారు. అధికార పగ్గాలు చేపట్టాక అక్షరాలా దానిని ఆచరణలో చూపుతున్నారు. శాసన మండలికి స్థానిక సంస్థల కోటా నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న ఒక్కగానొక్క ఎమ్మెల్సీ సీటునూ బీసీలకు కేటాయించి, ఆ వర్గంలో ఆనందం నింపారు. శాసన మండలి ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రస్తుతం సభ్యుడిగా ఉన్న టీడీపీ మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పదవీ కాలం త్వరలో ముగియనుంది. ఈయన స్థానంలో 90 శాతం మెజార్టీ కలిగిన వైఎస్సార్ సీపీ గెలుపు నునాయాసమేనని అందరికీ తెలుసు. ఎటొచ్చీ సీటు ఏ వర్గానికి కేటాయిస్తారనేది ఆసక్తికరంగా మారింది. తొలి నుంచీ చెబుతున్నట్లుగానే సీఎం జగన్ ఈ సీటును బీసీలకు కేటాయించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో మొదటి నుంచీ ఈ వర్గాల్లో పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తున్న శెట్టిబలిజ సామాజికవర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలని నిర్ణయించారు. రాజకీయ కుటుంబ నేపథ్యంతో పాటు ఆ సామాజికవర్గంలో పట్టున్న విద్యావంతుడు, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావును అభ్యర్థిగా ప్రకటించారు. ఆయనను పెద్దల సభకు ఏకగ్రీవంగా పంపించారు.

శెట్టిబలిజలిజలకు తొలి నుంచీ ప్రాధాన్యం

వైఎస్సార్ సీపీ ఆవిర్భావం తరువాత ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు తొలి అధ్యక్షుడిగా శెట్టిబలిజ సామాజికవర్గం నుంచి దివంగత మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయిని జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేశారు. జిల్లా చరిత్రలో ప్రతిపక్ష టీడీపీ ఏనాడూ ఈ వర్గానికి జిల్లా పగ్గాలు అప్పగించిన దాఖలాలు లేవు. వైఎస్సార్ సీపీ మాత్రం ఈ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పిస్తూ వస్తోంది. చిట్టబ్బాయి తరువాత అదే సామాజిక వర్గం నుంచి పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను ఎమ్మెల్సీని చేశారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా బోస్‌ను తన కేబినెట్‌లోకి తీసుకున్నారు. తర్వాత జగన్ ఎమ్మెల్సీ ఇవ్వడమే కాకుండా జిల్లా చరిత్రలోనే తొలిసారిగా ఉప ముఖ్యమంత్రిని కూడా చేశారు. రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా తొలిసారి గెలుపొందిన చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను కూడా కేబినెట్‌లోకి తీసుకున్నారు. తాజాగా కుడుపూడి సూర్యనారాయణను స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మండలికి పంపించారు.



జాయింట్ కలెక్టర్ ఇలక్కియ నుంచి ఎమ్మెల్సీ ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న కుడుపూడి సూర్యనారాయణ రావు. చిత్రంలో ఎంపీలు మార్గాని భరత్‌రామ్, వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి తదితరులు

అభినందనల వెల్లువ

శాసన మండలి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గంలో నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. ఆ సమయానికి వైఎస్సార్ సీపీ నుంచి కుడుపూడి ఒక్కరే బరిలో నిలిచారు. దీంతో ఆయన ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రకటించారు. ఎన్నికైనట్టుగా కుడుపూడికి ఆమె ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుడుపూడిని కాకినాడ, రాజమహేంద్రవరం ఎంపీలు వంగా గీత, మార్గాని భరత్‌రామ్, కాకినాడ సిటీ, పి.గన్నవరం ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కొండేటి చిట్టిబాబు అభినందించారు. అనంతరం కుడుపూడి కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, సెంట్రల్ డెల్టా చైర్మన్ కుడుపూడి బాబు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు గుబ్బల తులసీకుమార్, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, కుడుపూడి భరత్‌భూషణ్, సంసాని నాని, గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, దొమ్మేటి సత్యనారాయణ, ఇళ్ల శేషారావు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నవంబర్ నాటికి నూతన భవనంలో వైద్యసేవలు

ఎంపీ భరత్‌రామ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలోని నిర్మిస్తున్న ఈఎస్ఐ నూతన భవనంలో ఈ ఏడాది నవంబర్ నాటికి వైద్యసేవలు ప్రారంభమవుతాయని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఈఎస్ఐ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విషయాన్ని కేంద్రమంత్రి సంతోష్ సాంగ్వేర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆయన వెంటనే ఈఎస్ఐ ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి రూ.వంద కోట్లు మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం ఈఎస్ఐ నమోదు రెండున్నర లక్షల మందికి మాత్రమే అయిందని, వీరు కాకుండా ఆటో, వస్త్రదుకాణాలు, హోటళ్లలో పనిచేసే కార్మికులందరినీ ప్రత్యేక డ్రైవ్ ద్వారా గుర్తించి, వారికి కూడా ఈఎస్ఐ సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగసాయి, ఆర్ఎంవో డాక్టర్ సరళ, డాక్టర్ కిరణ్, డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ నవీన్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఉష, ఈఈ అభయ్ కుమార్, ఏఈ ఎన్.ఆదినారాయణ, జేఈ జి.హేమంత్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు ఎ.శ్రీహరి, మజ్జి అప్పారావు పాల్గొన్నారు.



ఈఎస్ఐ ఆసుపత్రి భవనం పనులను పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

ఎమ్మెల్సీ కుడుపూడికి ఘన స్వాగతం

ముఖ్యమంత్రి జగన్‌కు జేజేలు పలికిన నేతలు

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం తొలిసారి అమలాపురం వచ్చిన ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, శెట్టిబలిజ నేతలు అపూర్వ స్వాగతం పలికారు. స్థానిక హైస్కూలు సెంటర్‌లో ఎదురేగి స్వాగతం పలుకుతూ బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు. మిఠాయిలు పంచిపెట్టి పరస్పరం ఆలింగనం చేసుకుని ఆనందం వ్యక్తం చేశారు. సూర్యనారాయణరావును కాకినాడ కలెక్టరేట్ నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తదితరులు ఊరేగింపుగా కార్ల కాన్వాయ్‌తో అమలాపురం తోడ్కొని వచ్చారు. బీసీలకు, ముఖ్యంగా శెట్టిబలిజలకు సముచిత స్థానం కల్పిస్తూ కుడుపూడికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీ నేతలు జేజేలు పలికారు. అమలాపురం రాగానే ఆయనకు పార్టీ శ్రేణులు ఘన సత్కారం చేశాయి. సూర్యనారాయణరావు మాట్లాడుతూ, ఎమ్మెల్సీ పదవి ఇచ్చి, తనను తొలిసారి చట్టసభకు పంపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను సత్కరించిన వారిలో పార్టీ నాయకులు కుడుపూడి భరత్ భూషణ్, గుత్తుల శ్రీను, చప్పిడి శోభన్‌బాబు, పంపన పద్మలత, కుడుపూడి త్రినాథ్, మున్సిపల్ కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము తదితరులున్నారు.

రైతుల ముంగిటే పశు వైద్య సేవలు

ఒకటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రైతుల ఇంటివద్దకే పశువైద్య సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలో సంచార పశువైద్య వాహనాలను ప్రవేశపెట్టిందని కలెక్టర్ మాధవీలత అన్నారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారితో కలసి జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో గాలికుంటువ్యాధి నిరోధక టీకా పోస్టర్‌ను కలెక్టర్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ మార్చి ఒకటి నుంచి 31వ తేదీ వరకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో గాలికుంటువ్యాధి నిరోధక టీకా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతిరైతు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎస్‌టీజీ సత్య గోవింద్ మాట్లాడుతూ పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధికి చికిత్స లేదన్నారు. కేవలం టీకాలు వేయడం మాత్రమే నివారణ మార్గమన్నారు. డీఆర్‌వో జి.నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (టూరిజం) స్వామినాయుడు, ఉప సంచాలకులు (ఏహెచ్) డాక్టర్ జోత్స్న పాల్గొన్నారు.

నేడు స్పందనపై అధికారుల సమావేశం

- మూడు జిల్లాల అధికారులు పాల్గొనాలి
- కలెక్టర్ మాధవీలత వెల్లడి

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): స్పందనలో అర్జీలను పూర్తి పారదర్శకతతో పరిశీలించి నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ మాధవీలత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డీఆర్‌ఓ జి. నరసింహులుతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. స్వీకరించిన అర్జీలను అధికారులు సమగ్రంగా విచారించి పరిష్కార పత్రాన్ని అర్జీదారునికి అందజేయాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీ పునరావృతం కాకుండా ఆయా శాఖ అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో స్పందన, సుస్థిర అభివృద్ధి అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. సూచనలను ఇస్తూ సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. శిక్షణలో ఉమ్మడి గోదావరి జిల్లాలకు చెందిన అధికారులందరూ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరగుతుందన్నారు. స్పందనలో వచ్చిన అర్జీని 24 గంటలలోపు వెబ్‌సైట్ ఓపెన్ చేసి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఫేస్‌రీడింగ్ అటెండెన్స్ విధానాన్ని ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా అనుసరించాలన్నారు. సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారుల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సోమవారం 162 అర్జీలను స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత

పోలీసు స్పందనకు 27 ఫిర్యాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 27 ఫిర్యాదులు అందాయి. అడిషనల్ ఎస్పీ ఎం.రజనీ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. అర్జీదారులు చెబుతున్న సమస్యలను సానుకూలంగా విన్నారు. సమస్యలను జాప్యం లేకుండా తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అర్జీలపై చట్టప్రకారం విచారణ జరిపి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రజనీ

అన్నదాత మోమున ఆనందం

- నేడు వైఎస్సార్ రైతు భరోసా నగదు జమ
- జిల్లాలో 1.32 లక్షల మందికి లబ్ధి
- రైతు ఖాతాల్లో రూ.29.91 కోట్ల జమకు చర్యలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

రాజమహేంద్రవరం రూరల్ : అన్నదాతకు చేదోడు వాదోడుగా నిలిచేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. అందులో భాగంగా పీఎం వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద ఆర్థిక సాయం సహాయం అందించేందుకు ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 1.32 లక్షల మంది రైతుల ఖాతాల్లో మంగళవారం రూ.29.91 కోట్లు జమ చేయనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం బటన్ నొక్కి నిధుల విడుదలకు శ్రీకారం చుడతారు. వెంటనే జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా సాయం నేరుగా రైతు ఖాతలో జమవుతుంది. ఏటా రూ.13,500 చొప్పున విడతలవారీగా ప్రభుత్వం రైతు ఖాతాల్లోకి జమ చేస్తోంది.



రైతు భరోసా రెండవవిడత చెక్కు అందిస్తున్న చిత్రం (ఫైల్)



అర్హులందరికీ మేలు జరిగేలా..

గతంలో 1. 32 లక్షల మంది రైతులు వైఎస్సార్ రైతు భరోసాపథకం కింద లబ్ధి పొందేవారు. అర్హత ఉన్న ప్రతీ రైతుకు ఈ పథకంలో లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం గట్టిగా సంకల్పించడంతో జిల్లాలో ఈసారి అదనంగా మరికొంత మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఏ ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకూడదనేది ప్రభుత్వ ఉద్దేశం. గత ఏడాది వైఎస్సార్ రైతు భరోసా మొదట విడత సాయం జమ అయింది. అదే ఏడాది రెండవ విడత అక్టోబర్ 15న జమ చేశారు. ఆఖరివిడత భరోసా నగదు మంగళవారం జమ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రబీ సాగు పెట్టుబడుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఇటువంటి తరుణంలో తమ ఖాతాల్లో ప్రభుత్వ సాయం నగదు జమకావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేటు వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చే కష్టం తప్పుతుందని భావిస్తున్నారు.



లబ్ధి వివరాలు ఇలా ఉన్నాయి...

నియోజకవర్గం	లబ్ధి దారులు	లబ్ధి (రూ. లక్షలలో)
అనపర్తి	20,233	436.3016
రాజమహేంద్రవరంరూరల్	7262	145.8694
రాజమహేంద్రవరంఅర్బన్	0	0
రాజానగరం	29802	671.2218
గోకవరం(జగ్గంపేట)	10680	249.9621
గోపాలపురం	26214	573.1764
కొవ్వూరు	16970	353.0771
నిడదవోలు	21519	461.2616
మొత్తం	1,32,680	2890.87

క్రమం తప్పకుండా జమ



పంట పెట్టుబడులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న రైతు భరోసా పథకం పంట పెట్టుబడికి ఎంతగానో ఉపయోగపడుతుంది. మూడేళ్లుగా క్రమం తప్పకుండా ఏటా రూ.13,500 చొప్పున బ్యాంకు ఖాతాలోకి జమ అవుతుంది. ప్పులు చేసి సాగుచేసి వడ్డీలు కట్టే రైతులకు రైతు భరోసా పథకం ఒక వరం.

–కొత్తపల్లి కేశవరామారావు,
మండల వ్యవసాయసలహామండి చైర్మన్, తొర్రేడు.

రైతు ఖాతాకు మూడోవిడత సొమ్ము



వైఎస్సార్ రైతుభరోసా–పిఎం కిసాన్ వరసగా నాల్గవ ఏడాది మూడో విడత సొమ్ము నేరుగా మంగళవారం రైతుల ఖాతాకు జమ చేస్తున్నాం. జిల్లాలో భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి ఏటా రైతుభరోసా కింద రూ.13,500(రాష్ట్ర ప్రభుత్వం రూ.7500, పీఎంకిసాన్‌కింద రూ.6000) ఆర్థిక సహాయం లభిస్తోంది. ఈ రబీ సీజన్‌లో పెట్టుబడి సహాయంగా ఇది ఉపకరిస్తుంది.

–ఎస్.మాధవరావు,
జిల్లావ్యవసాయాధికారి

పాఠశాలే ప్రయోగశాల

- విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు అక్కడే పునాది
- ఆ దిశగానే ప్రభుత్వాల కృషి
- నేడు జాతీయ సైన్స్ దినోత్సవం


జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన (ఫైల్)

రాయవరం: మనసులో జిజ్ఞాస మొదలవ్వాలి.. మస్తిష్కాన్ని కదిలించాలి.. విన్నూత్న ఆలోచనలు ఉరకలెత్తించాలి.. నిశితంగా పరిశీలించాలి.. ఆ ఆసక్తి నుంచి నవతరాన్ని ఒక ఆశయం దిశగా నడిపించాలి.. ఇంతటి శక్తి కేవలం ఒక్క సైన్స్‌కు మాత్రమే ఉంది. భారత శాస్త్రవేత్త సీవీ రామన్ రామన్ ఎఫెక్ట్‌ను ప్రకటించిన రోజు ఫిబ్రవరి 28. దీనిని ఏటా జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఒక్క రోజు సైన్స్ ప్రాధాన్యం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడమే కాదు.. వారిలో శాస్త్రీయ దృక్పథం పెంపొందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాది పొడవునా పాఠశాల స్థాయి నుంచే పకడ్బందీ కృషి చేస్తున్నాయి. ఫలితంగా పుస్తకాలతో కుస్తీ పడుతూ.. మార్కుల వేటలో బిజీగా ఉంటూనే.. మరోపక్క ఎంతోమంది విద్యార్థులు పరిశోధనలకు ప్రాణం పోస్తున్నారు. 'డిజైన్ థింకింగ్' పేరుతో నేటి యువతరం నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషితో ప్రతి పాఠశాలా ప్రయోగశాలగా మారుతోంది.

సైన్స్ అభివృద్ధికి కృషి జరుగుతోందిలా..

- ఏపీ సమగ్ర శిక్ష ద్వారా పాఠశాలల్లో సైన్స్ పరికరాల కొనుగోలుకు కొన్నేళ్లుగా నిధులు మంజూరు చేస్తున్నారు.
- అటల్ ఇన్నోవేషన్ మిషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 2019 నుంచి 10 వేల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. వీటిలో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 129 ల్యాబ్‌లు ఏర్పాటయ్యాయి. సమాజానికి సైన్స్ ఏవిధంగా ఉపయోగపడుతుంది.. సమాజంలో ఉన్న ప్రశ్నలకు సైన్స్ ఎలా సమాధానాలు చూపిస్తుందో తెలియజేయడమే ఈ ల్యాబ్‌ల ఉద్దేశం. వీటిని ఉమ్మడి జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను పాఠశాల స్థాయి నుంచే ఏర్పాటు చేసింది. పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో ఈ ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా సృజనాత్మక ఆలోచనలకు శాస్త్రీయ దృక్పథాన్ని జోడించి సరికొత్త పరిశోధనల దిశగా విద్యార్థులతో అడుగులు వేయించారు.
- రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సైన్స్ కిట్స్ అందజేసింది.
- రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా అగస్త్య ఫౌండేషన్ వంటి పలు సంస్థలకు సైన్స్‌కు ప్రాధాన్యం ఇచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సైన్స్ ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్ తరగతులు కూడా నిర్వహించారు. అలాగే 'నిష్ఠ' ద్వారా ప్రయోగశాలలను ఏవిధంగా వాడవచ్చన్న అంశంపై సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు.
- అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, సైన్స్ సెమినార్లు, సైన్స్ డ్రామాల నిర్వహణకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక సైన్స్ అధికారిని నియమించింది. వారి ఆధ్వర్యంలోనే ఏటా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు, ఇన్‌స్పైర్ మనక్, చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నారు.
- ఈ ఏడాది ఇన్‌స్పైర్ మనక్‌కు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,650 పాఠశాల స్థాయి నామినేషన్లు వేయగా, జిల్లా స్థాయికి 302 ఎంపికయ్యాయి.

శాస్త్రీయ దృక్పథం పెంచడమే

మూఢ నమ్మకాలను పారదోలి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం సైన్స్ ప్రధాన ఉద్దేశం. వీటితో పాటు ప్రజలకు మెరుగైన జీవనం అందించడం, సమాజంలో నిత్యం ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలు చూపడం కూడా సైన్స్ లక్ష్యాలు.



– కె.శ్రీకృష్ణసాయి, వ్యవస్థాపక అధ్యక్షుడు, రేవతి ఫౌండేషన్, రామచంద్రపురం

చిన్నతనం నుంచే ఆసక్తి పెంచాలి

సైన్స్‌పై విద్యార్థి దశ నుంచే ఆసక్తి పెంపొందించాలి. ముఖ్యంగా విద్యార్థులతో చిన్నచిన్న ప్రయోగాలు చేయిస్తే వారిలో పరిశోధనలపై మక్కువ పెరుగుతుంది. ప్రశ్నించే తత్వమే పరిశోధనలకు పునాది.



– శ్రీనివాస వినీల్, జిల్లా సైన్స్ అధికారి, కాకినాడ

పాఠశాలే ప్రయోగశాల

ప్రతి వ్యక్తి జీవనానికి పునాది పాఠశాలలోనే పడుతుంది. ఈ దశ నుంచే విద్యార్థికి ప్రయోగశాల పరిజ్ఞానం అందించే కృషి జరగాలి. భవిష్యత్ ఆవిష్కరణల దిశగా వారిని నడిపించడానికి ఉపాధ్యాయులు, అధ్యాపకులు కృషి చేయాలి.



– జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

క్లుప్తంగా

భారీగా గంజాయి పట్టివేత

- 321.730 కేజీల సరకు స్వాధీనం
- విలువ రూ.16.05 లక్షలు


గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న సీఐ సూర్య అప్పారావు, ఎస్సై విద్యాసాగర్

జగ్గంపేట: రామవరంలోని రాజస్థాన్ హర్యానా ధాబా వద్ద పోలీసులు సోమవారం భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సర్కిల్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ బి.సూర్య అప్పారావు ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ముందుగా అందిన సమాచారంతో పోలీసులు 16వ నవంబర్ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. తమిళనాడు వెళ్తేందుకు సిద్ధంగా ఉన్న లారీని తనిఖీ చేయగా అందులో 12 బస్తాల్లో ఉంచిన 321.730 కేజీల గంజాయి పట్టుబడింది. దీని విలువ రూ.16.05 లక్షలుగా అంచనా వేశారు. లారీ డ్రైవర్ తంగయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి ఒక సెల్‌ఫోన్, రూ.2 వేల నగదు, లారీని స్వాధీనం చేసుకున్నారు. అనకాపల్లిలోని ఒక వ్యక్తి వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి, రూ.25 వేల కిరాయికి తమిళనాడుకు చేరుస్తానని నిందితుడు తంగయ్య పోలీసు విచారణలో చెప్పాడు. అక్కడ మరో వ్యక్తి ఈ గంజాయిని అధిక ధరకు విక్రయిస్తాడని తెలిపాడు. తంగయ్యపై పోలీసులు కేసు నమోదు చేసి, రిమాండుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించి మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సీహెచ్ విద్యాసాగర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

- ఉల్లంఘిస్తే వాహన యజమానులు, తల్లిదండ్రులపై కేసులు
- ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి హెచ్చరిక


సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి, కోనసీమ జిల్లా ఎస్పీ

అమలాపురం టౌన్: మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్సులు లేనివారికి వాహనాలు ఇవ్వవద్దని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. దీనిని ఉల్లంఘిస్తే ఆ వాహనాల యజమానులు, తల్లిదండ్రులు, సంరక్షకులపై కేసులు నమోదు చేస్తామని, కఠిన శిక్షలు తప్పవని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి, అవగాహన లోపంతో వారు చేసే రోడ్డు ప్రమాదాలకు బాధ్యులు కావొద్దని పేర్కొన్నారు. మైనర్లకు, లైసెన్స్‌లు లేనివారికి వాహనాలు ఇచ్చే యజమానులు, తల్లిదండ్రులు, గార్డియన్లపై ఐపీసీ 304 సెక్షన్ కింద పదేళ్లు, 308 సెక్షన్ కింద ఏడేళ్ల శిక్ష విధించే అవకాశముంటుందని వివరించారు. మైనర్లు వాహనాలు నడిపినప్పుడు ప్రమాదం జరిగి, ఎవరి మరణానికైనా కారణమైతే వాహన చోదకులే కాకుండా వారి కుటుంబీకులు కూడా ఇబ్బందులు పడతారని గుర్తు చేశారు. ఎక్కువగా మైనర్లు, లైసెన్సులు లేని వారివల్లనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వారు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకుండా అతి వేగంగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారని ఎస్పీ పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత


క్రీడా పోటీలో పాల్గొన్న ఉద్యోగులు

రాజానగరం: క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా పని ఒత్తిళ్ల నుంచి ఉపశమనం, మానసిక ప్రశాంతత పొందవచ్చని కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు అన్నారు. చక్రద్వారబంధం గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కంటిపూడి కియో బాడీ షాప్ వద్ద కంటిపూడి గ్రూప్ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కంటిపూడి కియో మోటార్స్, కంటిపూడి నిస్సాన్, కంటిపూడి సుజుకీ అండ్ స్టీల్స్‌లో పని చేస్తున్న ఉద్యోగులు రాజమహేంద్రవరం, కాకినాడ టీమ్‌లుగా ఏర్పడి, వివిధ రకాల క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, డాడ్జిబాల్, త్రోబాల్, లాంగ్‌జంప్, రన్నింగ్, మ్యూజికల్ చైర్స్, బెలూన్ అండ్ గ్లాస్, లెమన్ అండ్ స్పూన్ గేమ్స్ వంటి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చెరుకూరి వీవీ సత్యనారాయణమూర్తి, ముళ్లపూడి జగజ్జనరావు, కంటిపూడి మన్‌మోహన్ తదితరులు కూడా పాల్గొన్నారని మేనేజింగ్ డైరెక్టర్ కె.వినయ్ ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నదాతలపై ఏమిటీ నిర్లక్ష్యం?

- 'డయల్ యువర్ ఈఓ'లో ఫిర్యాదు
- సత్యదేవుని ప్రసాదం నాణ్యతపై కూడా ప్రశ్నలు
- పరిశీలిస్తామన్న ఈఓ


భక్తునితో ఫోనులో మాట్లాడుతున్న ఈఓ సత్యనారాయణమూర్తి

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి విరాళాలు సమర్పిస్తున్న దాతలపై అన్నవరం దేవస్థానం నిర్లక్ష్య ధోరణి చూపుతోందని పలువురు భక్తులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన 'డయల్ యువర్ ఈఓ' కార్యక్రమంలో దేవస్థానం ఈఓ ఎన్వీ సత్యనారాయణమూర్తికి ఫిర్యాదు చేశారు. ఈ నెల 8న నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం సమర్పిస్తే రశీదు ఇచ్చారు తప్ప ఇప్పటి వరకూ బాండ్ ఇవ్వలేదని వెంకట్రావు (పిఠాపురం); అన్నదానానికి రూ.లక్ష విరాళం చెల్లిస్తే బోర్డు మీది దాతల జాబితాలో తన పేరు లేదని, ఆరేళ్ల క్రితం రూ.10 వేలు విరాళం ఇచ్చిన తనకు అన్నదానం చేస్తున్నట్టు సమాచారం రావడం లేదని శివకోటి విష్ణుమూర్తి (కాట్రావులపల్లి) ఫిర్యాదు చేశారు. వీటిపై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఈఓ బదులిచ్చారు. సత్యదేవుని గోధుమ నూక ప్రసాదం నాణ్యత పెంచేందుకు, కచ్చితమైన తూకానికి, బంగీ ప్రసాదం స్టాకు ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని మెండపల్లి గుప్తా (తాటిపాక), కె.వెంకటేశ్వరరావు (కాకినాడ) అంకం కుమారస్వామి (అయినవిల్లి) ఫిర్యాదు చేశారు. ప్రసాదం నాణ్యతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, బంగీ ప్రసాదం తగినంత స్టాక్ ఉంచాల్సిందిగా ఆదేశించామని ఈఓ చెప్పారు. ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో కూడా ప్రసాదాలు విక్రయించాలని ఆ భక్తులు కోరగా, అటువంటి ఆలోచన లేదని ఈఓ స్పష్టం చేశారు. రత్నగిరిపై అన్నప్రాశనలు, అక్షరాభ్యాసాలు జరిగే మండపంలో సౌకర్యాలు లేవని, పిచ్చి రాతలతో గోడలు కళావిహీనంగా ఉన్నాయని, సరస్వతీదేవి విగ్రహం ఆలనా పాలనా లేకుండా ఉందని వంకాయల శ్రీనివాసరావు (అన్నవరం) ఈఓ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా ఇంజినీరింగ్ అధికారులను ఈఓ ఆదేశించారు. దివ్యాంగుల కోసం కేశఖండన శాల, పబ్లిక్ టాయిలెట్ల వద్ద వెస్ట్రన్ స్టైల్ కమోడ్‌లు ఏర్పాటు చేయాలని, ఈ సౌకర్యం లేక తాను చాలా ఇబ్బంది పడ్డానని పెదిరెడ్ల నూకరాజు (రాజమహేంద్రవరం) పేర్కొన్నారు. దీనిపై ఈఓ సత్యనారాయణమూర్తి సానుకూలంగా స్పందించారు. దేవస్థానం నిర్వహిస్తున్న సహజ ఆసుపత్రిని గతంలో మాదిరిగానే కొండ పైకి తీసుకురావాలని, అన్ని రకాల మసాజ్‌లు, చికిత్సలు అందించాలని విశ్నీడి వేంకటేశ్వరరావు (కాకినాడ), శ్రీలక్ష్మి (విశాఖపట్నం) కోరారు. సత్రాల్లో గదులు ఖాళీ లేవంటూనే ఫోన్‌లో రికమండేషన్ చేసిన వారికి ఇస్తున్నారని, దీనిని అరికట్టాలని జేటీ రామారావు (కాకినాడ), కర్రి శ్రీనివాసరెడ్డి (రావులపాలెం) కోరారు. పంపా రిజర్వాయర్ వద్ద పారిశుధ్యం సక్రమంగా చేయడం లేదని, అందువలన దేవుని కార్యక్రమాల నిర్వహణకు పంపా సత్రం వద్ద ప్రత్యేకంగా కోనేరు ఏర్పాటు చేయాలని గ్రంధి వెంకట రమణమూర్తి (అన్నవరం) కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

- కలెక్టరేట్ వద్ద కలకలం
- కాపాడిన పోలీసులు


కలెక్టరేట్ భవనం పైకి ఎక్కిన దుర్గాదేవిని వారిస్తున్న పోలీసు అధికారి

కాకినాడ సిటీ: తన ఆస్తిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని, తమను చంపేందుకు ప్రయత్నిస్తున్నారని, తమ ఆస్తులను కాపాడి, తమకు న్యాయం చేయాలని కోరుతూ ఓ మహిళ కాకినాడ కలెక్టరేట్ పైకి ఎక్కి ఆత్మహత్యా యత్నం చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. నచ్చజెప్పేందుకు ప్రయత్నం చేశారు. చివరకు చాకచక్యంతో ఆమెను కాపాడి, సమస్య తెలుసుకొన్నారు. అనంతరం డీఆర్ఓ కె.శ్రీధర్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించారు. వివరాలివీ.. కాకినాడ భాస్కర్ నగర్‌లో నివాసం ఉంటున్న మేడిశెట్టి దుర్గాదేవి, ఆమె భర్త రాంబాబు సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో జరుగుతున్న జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి వచ్చారు. ఎవ్వరూ ఊహించని విధంగా దుర్గాదేవి కలెక్టరేట్ భవనం పైకి చేరుకుంది. తమ ఆస్తి విషయంలో ఏ ఒక్కరూ న్యాయం చేయడం లేదని ఆరోపించింది. ఆత్మహత్య చేసుకుంటానని చెప్పింది. పోలీసులు ఆమెకు నచ్చజెప్పి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దుర్గాదేవి భర్త రాంబాబు విలేకర్లతో మాట్లాడుతూ, రాజమహేంద్రవరంలో తమకున్న 12.5 సెంట్ల భూమి అమ్మి పెడతానని ఓ న్యాయవాది నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మోసం చేశారన్నారు. ఇందులో అక్కడి మాజీ కార్పొరేటర్ హస్తం ఉందని ఆరోపించారు. తాము నివాసం ఉంటున్న ఇంటి నుంచి కుట్రపూరితంగా తమను వెళ్లగొట్టారని, చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని వాపోయాడు. తమ ప్రాణాలకు రక్షణ లేదని గమనించి కాకినాడకు మకాం మార్చామని తెలిపారు. ఆస్తి విషయమై పోలీసులకు, అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరగలేదని రాంబాబు వివరించారు.

18న జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వచ్చే నెల 18వ తేదీన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి సోమవారం తెలిపారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టులలో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. కోర్టులోని పెండింగ్ కేసులు, కుటుంబ తగాదాలు, వినియోగదారుల కేసులు, రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారని తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి లోక్ అదాలత్ జరుగుతుందన్నారు.

పురుగు మందు తాగిన యువకుడి మృతి

గోపాలపురం: నందిగూడేనికి చెందిన బొల్లారెడ్డి పవన్‌కుమార్ (23) పురుగు మందు తాగి మృతి చెందాడు. ఎస్సై కె.రామకృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లారెడ్డి చంద్రశేఖర్ రెండో కుమారుడు పవన్ కల్యాణ్ కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. తమ పొలంలో ఆదివారం పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కొయ్యలగూడెం ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పవన్ కల్యాణ్ సోమవారం మృతి చెందాడు.